క్లుప్తంగా

వాహనాలకు జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్టీసీ డీఎం నరసింహులు, ఎంవీఐ మాధవరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. మొత్తం 24 వాహనాలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాటికి 30,500 రూపాయల జరిమానా విధించినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు తెలిపారు. ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్



నూతన ప్రిన్సిపాల్ సద్గుణరావును సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కొమరోలు: కొమరోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.సద్గుణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మద్దిపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇక్కడ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. నూతన ప్రిన్సిపాల్‌ను కళాశాల సిబ్బంది సన్మానించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యంతోపాటు, చదువుపై నిశ్చలమైన ధ్యాస ఉంచేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగా అలవాటు చేసుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో ఇంట్లో ఉంటే టీవీ, సెల్‌ఫోన్లకు అలవాటుపడతారని, గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులకు హాజరుకావాలని సూచించారు.

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరిశీలించారు. గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను తనిఖీ చేశారు. ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం తదితర అంశాల్లో పిల్లలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్ష నిర్వహించగా ప్రథమ సంవత్సరంలో 166 మందికిగాను 163 మంది హాజరైనట్లుగా పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ప్రభాకర్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 16 మందికిగాను అందరూ హాజరైనట్లు చెప్పారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు




సంఘటనా స్థలంలో క్షతగాత్రులు


కంభం: ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం ఉదయం కంభం–తర్లుపాడు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు.. కందులాపురం కూడలి నుంచి ముగ్గురు యువకులు తర్లుపాడు రోడ్డులో బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి కిందపడిపోయారు. ఆటో అద్దం పగిలిపోగా, ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

అద్దె భవనాలే ముద్దు!

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- అద్దె భవనాల్లోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు
- ఆక్రమణకు గురికాకముందే కాపాడుకోవాలంటున్న ప్రజలు
- ఇంకా పలు చోట్ల ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు



జాతీయ రహదారికి ఆనుకుని నిరుపయోగంగా ఉన్న పాల శీతల కేంద్రం



నిరుపయోగంగా ఉన్న పాల కేంద్రం క్వార్టర్స్

కంభం:

ఏడాది క్రితం వరకు అధికారులు, ప్రజలతో కళకళలాడిన కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నేడు బూత్ బంగ్లాల మాదిరి దర్శనమిస్తున్నాయి. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా మారి వెలవెలబోతున్నాయి. ఏళ్లతరబడి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పాలకులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భవనాలన్నీ హైవే రోడ్డు ఆనుకుని, మంచి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఉండటం, ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో క్రమంగా అవి ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజాసంఘాల నాయకులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అనంతపురం– అమరావతి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాలకేంద్రం ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. గత కొన్నేళ్లుగా అది శిథిలావస్థకు చేరిపోవడంతో భవనంతోపాటు క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. సుమారు 5 ఎకరాల్లో విస్తరించి ఉన్న పాలకేంద్రం స్థలం విలువ ప్రస్తుత మార్కెట్‌లో రూ.7 కోట్లకు పైగా ఉంది. హైవే రోడ్డుకు కూత వేటు దూరంలో గత కొన్నేళ్లుగా అటవీశాఖ భవనం, దాని పక్కన కొంత ఖాళీ స్థలం ఖాళీగా ఉన్నాయి. దీని విలువ సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు పలుకుతోంది. విద్యుత్ శాఖ క్వార్టర్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఓ వైపున గత 15 ఏళ్ల క్రితం నిర్మించి వదిలేసిన భవనం నిరుపయోగంగా పడి ఉంది. ఇంకా పలుచోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంతగూడు కరువు

నిత్యం వందలాది మంది మహిళలు వచ్చి వెళ్లే వెలుగు కార్యాలయం ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. గతంలో అధికారులు కార్యాలయ నిర్మాణం కోసం పలుమార్లు స్థలాన్వేషణ చేసినా ఆ తర్వాత అది కార్యరూపం దాల్చలేదు. లేబర్ ఆఫీస్, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, ఫారెస్టు కార్యాలయం, పలు ప్రభుత్వ హాస్టళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేక ఉద్యానవన శాఖ, మత్స్యశాఖ కార్యాలయాలు రెండూ ఒకే గోడౌన్‌లో పార్టీషన్ చేసి నిర్వహిస్తున్నారు. కంభం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సొంత భవనం నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్వేషణ చేస్తున్నారు. ఇంకా పలుచోట్ల సచివాలయాలు, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలకు స్థలాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పరిస్థితి.



హైవే రోడ్డుకు కూతవేటు దూరంలో నిరుపయోగంగా ఫారెస్టు కార్యాలయం



అద్దె భవనంలో నిర్వహిస్తున్న లేబర్ ఆఫీస్

ఏళ్లతరబడి ఎదురుచూపులే..

కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా నేటికీ సొంత భవనం లేదు. జూనియర్ కళాశాలలోనే కొన్ని గదుల్లో డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో చిన్న కంభంలో 5 ఎకరాల స్థలం కేటాయించినప్పటికీ దూరం అనే కారణంతో అక్కడికి వెళ్లడానికి ఆసక్తి కనబరచలేదు. ఎన్నో రోజుల నుంచి కంభంలో ఆర్టీసీ డిపో, కోర్టు నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. అంబేడ్కర్ భవనం, ముస్లిం షాదీఖానా నిర్మాణాల కోసం ఆయా సామాజికవర్గాల ప్రజలు నేటికీ ఎదురు చూస్తున్నారు.

వినియోగంలోకి వచ్చేనా?

విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకముందే కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్న స్థలాలను అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించి వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెలుగు కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన స్థలాలు కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి



నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు, విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. సొంత భవనాలు లేక చాలా చోట్ల సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి అవసరమైన కార్యాలయాలకు కేటాయించాలి.

– గొంగటి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కంభం

అంబేడ్కర్ భవనానికి స్థలం ఇవ్వాలి



గతంలో అంబేడ్కర్ సామాజిక భవనం కోసం స్థలం మంజూరు చేశారు. నేటి వరకు స్థలం అప్పగించకపోవడంతో భవన నిర్మాణం చేపట్టలేదు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఆనంద్ ప్రదీప్, ఎంపీటీసీ సభ్యుడు, కంభం

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కేటాయించాలి



చాలా ప్రభుత్వ కార్యాలయాలు సొంతగూడు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కేటాయించి భవనాలు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి.

– మహమ్మద్ ఇబ్రహీం, ఏఐటీయూసీ నాయకుడు

మొరాయించిన రైల్వే గేట్లు..

వాహనదారులకు ఇక్కట్లు



గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రైల్వే గేట బుధవారం మరమ్మతులకు గురికావడంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధదవారం సాయంత్రం రైళ్ల రాకపోకల సమయంలో రైల్వే సిబ్బంది గేటు వేశారు. రైళ్లు వెళ్లిన తర్వాత ఇరువైపులా గేట్లును ఎత్తేందుకు సిబ్బంది ప్రయత్నించగా సాంకేతిక సమస్య కారణంగా తెరుచుకోలేదు. దీంతో గంటపాటు వాహనదారులు అక్కడే వేచిఉండాల్సి వచ్చింది. రాచర్ల గేటు అవతలి వైపు మార్కెట్ యార్డు వరకు, ఇవతలి వైపు కుమ్మరాంకట్ట సెంటర్ వరకు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే సిబ్బంది గంటపాటు శ్రమించి గేట్లకు మరమ్మతులు చేయడంతో వాహనదారులు ఉసూరుమంటూ ముందుకుసాగారు. రాచర్ల గేటు వద్ద వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్డన్ సెర్చ్‌లో 25 వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలతో సీఐ సుబ్బారావు, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని అల్లూరి పోలేరమ్మ గుడి ఏరియా, హోంగార్డు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో బుధవారం వేకువజామున సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 వాహనాలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు ఎవరైనా ఉంటే సమాచారం అందించాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా పెడతామని చెప్పారు. తనిఖీల్లో ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్ రావు, అంకమరావు, అహరోన్, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రాజకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 13వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు, కమిటీ సభ్యుడు యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు. 15న శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, 16న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం, 17న రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం, 18న శ్రీరుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కల్యాణం, 19న శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం, 20న సీతారాముల కల్యాణం, 21న సీతారామ చంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి, 22వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజ, సర్వదేవతా దర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నిత్యం భక్తులకు అన్న సంతర్పణ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



మీటర్ల రికార్డులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులతో కూడిన బృందాలు బుధవారం గిద్దలూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. మీటర్లు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న 8 మంది, అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న ఏడుగురు, మీటరు లేకుండా నేరుగా విద్యుత్ వాడుతున్న 13 మందిని గుర్తించి మొత్తం రూ.2.42 లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ శాఖ అధికారులు 37 బృందాలుగా విడిపోయి ఈ దాడులు నిర్వహించారు. తనిఖీల్లో డీఈఈ బి.శేషగిరిరావు, మార్కాపురం, కంభం డీఈఈలతో పాటుగా స్థానిక ఏఈ నారాయణరెడ్డి, విజిలెన్స్ అధికారుల బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఈ శేషగిరిరావు మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో

గృహోపకరణాలు దగ్ధం

పొదిలి రూరల్: పొదిలి మండలం అన్నవరం పంచాయతీలోని చింతగుంపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. కాలనీకి చెందిన గుంటూరి సురేష్, గుంటూరి దేవయ్య, గుంటూరి ఇసాక్‌కు చెందిన 3 గృహాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వస్తువులు కాలిపోయి పొగలు వచ్చాయి. దీంతో ఆయా నివాసాల్లో ఉన్నవారు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. కాలనీకి సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఒరిగిపోయి, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటమే ప్రమాదానికి కారణమని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆరోపించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన పిడతల ప్రవీణ్



గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత సతీమణికి 'అన్నా' పరామర్శ



నారాయణమ్మను పరామర్శిస్తున్న అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సూరా పాండురంగారెడ్డి భార్య నారాయణమ్మ అనారోగ్యానికి గురై పట్టణంలోని డీజీఆర్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పాండురంగారెడ్డితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సీఆర్ఐ మురళి, అన్నా రంజిత్ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో సాగర్ నీటి ట్యాంకు

పొదిలి: పట్టణ పరిధిలోని కాటూరివారిపాలెంలో సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్‌పీ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. లీకేజీలు ఏర్పడటంతో తాగునీరు వృథాగా పోతోంది. సాగర్ నీటి పంపిణీ కోసం అప్పట్లో 60 వేల లీటర్ల కెపాసిటీతో ట్యాంకు నిర్మించారు. ట్యాంకు పైభాగంలో పాచిపట్టి ఉండటంతో ఇక లోపల ఎలా ఉంటుందోనని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంతోపాటు ట్యాంకును శుభ్రం చేయాలని కోరుతున్నారు. మరో వైపు ట్యాంకు పక్కనే భారీగా మురుగు నిల్వ చేరింది. పక్కనే అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, ఆంజనేయస్వామి ఆలయం ఉన్నాయి. మురుగులోనే చెత్త చెదారం చేరి, పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలకు ఆవాస కేంద్రంగా మారింది. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. కాలువ నిర్మించి మురుగు ముందుకు పోయేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డిని వివరణ కోరగా అమృత్ నిధులతో ట్యాంకు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మురుగు కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ట్యాంక్ పక్కనే మురుగు



శిథిలావస్థకు చేరిన ట్యాంకు